సారా రాకాసి కోరలు చాస్తోంది!



కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 5: గుడుంబా రాకాసి కోరలు చాస్తోంది. గ్రామాల్లో ఈ దందా మళ్లీ రెక్కలు విప్పుతోంది. శివారు ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో జోరుగా తయారీ జరుగుతుండగా.. యథేచ్ఛగా రవాణా, అమ్మకాలు సాగుతున్నాయి. సారా కట్టడి చర్యల్లో భాగంగా గత ప్రభుత్వం చేసిన ప్రయత్నం పెద్దగా ఫలితాన్నివ్వలేదు. సారా తయారీ, అమ్మకందారులఆలోచనను మళ్లించలేక పోయింది. వారికి అందించే ప్రోత్సాహకం పూర్తి స్థాయిలో అందకపోవడంతో మళ్లీ అదే దందా వైపు చాలా మంది మొగ్గు చూపుతున్నారు. ఎక్సైజ్ అధికారుల దాడులు సైతం ఈ మధ్యకాలంలో మందగించడంతో తయారీ, అమ్మకందారులకు మరింత కలిసొస్తోంది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సారా, గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు నడుం బిగించినా.. గుడుంబా నిర్మూలనకు ప్రభుత్వం తరఫున అందించే ప్రోత్సాహకంపై ఎలాంటి స్పష్టత రావడం లేదు. ఫలితంగా గుడుంబా తయారీ, అమ్మకందారులు అదే దందాను కొనసాగిస్తున్నారు. దీనిని ఎవరికీ అనుమానం రాని చోట, రహస్య ప్రదేశాల్లో దీన్ని చేపడుతున్నారు. చేలు, పాడుబడ్డ ఇళ్లు, జన సంచారం లేని ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ ప్రదేశాలకు ఒక రోజు ముందుగానే తయారీకి కావాల్సిన యూరియా, పటిక, బెల్లం ఇతరత్రా ముడిసరుకులను తీసుకెళ్లి బట్టీలు పెట్టి సారాను కాస్తున్నారు. అలా తయారు చేసిన సారాను విక్రయించేందుకు క్యాన్లు, ఇతరత్రా అనుమానం రాని పాత్రల్లో పల్లెలు, పట్టణాలకు అక్రమంగా తరలిస్తున్నారు. రవాణా ప్రధానంగా అర్ధరాత్రి దాటాక, తెల్లవారుజామున సరఫరా జరుగుతున్నట్లు తెలిసింది.

అధికంగా ఈ ప్రాంతాల్లోనే..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో నాటుసారా తయారీ జోరుగా సాగుతోంది. అయితే.. ప్రధానంగా భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్దారం, ఆజంనగర్, దీక్షకుంట, పంబాపూర్, చిట్యాల మండలంలో పాశిగడ్డతండా, లక్ష్మీపురంతండా, అందుకుతండా, ఒంటిప్పులతండా, గిద్దెముత్తారం, కాటారం మండలంలోని కొత్తపల్లితండా, గట్లకుంట, గంగారం, లక్ష్మీపురం, రేగొండ మండలంలోని జగ్గయ్యపేట, రామన్నగూడెంతండా, జూబ్లీనగర్, గాంధీనగర్, టేకుమట్ల మండలంలోని వెలిశాల, రామకృష్ణపూర్, గర్మిళ్లపల్లి, వెంకట్రావుపల్లి, మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు సర్వాయిపేట, సూరారం, మల్హర్ మండలంలోని పెద్దతూండ్ల, అడ్వాలపల్లి, రుద్రారం, మల్లారం, చిన్నతూండ్ల, దుబ్బపేట, తాడిచర్ల, అన్సాన్‌పల్లి, కొయ్యూరు గ్రామాల్లో తయారీ విచ్చలవిడిగా నడుస్తున్నట్లు సమాచారం. అడపాదడపాగా ఎక్సైజ్ అధికారులు నిర్వహించే దాడులు సైతం ప్రధానంగా ఈ గ్రామాల్లోనే జరుగుతోంది.

అక్రమార్కులకు అండ?

ఎక్సైజ్ శాఖలో గుడుంబా కట్టడి చర్యలు తూతూమంత్రంగా కొనసాగుతాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరమున్నప్పుడు తప్ప అధికారులు దాడులపై పెద్దగా దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. కొంత మంది సిబ్బంది సారా తయారీదారుల నుంచి మామూళ్లు వసూలు చేసి ఉన్నతాధికారుల కదలికలను తయారీదారులకు ఎప్పటికప్పుడు చేరవేస్తుంటారనే చర్చ జోరుగా సాగుతోంది. దాడుల్లో పట్టుబడిన వారిలో తమకు కావాల్సిన వారిని వదిలేసి చిన్నాచితక వారిపై తమ ప్రతాపం చూపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే.. ఇటీవల గుడుంబాపై ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాలతో పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి జిల్లా వ్యాప్తంగా వివిధ చోట్ల గుడుంబా స్థావరాలపై విస్తృతంగా దాడులు చేపట్టింది.

- గ్రామాల్లో మళ్లీ పుంజుకుంటుకున్న గుడుంబా దందా
- యథేచ్ఛగా తయారీ.. అమ్మకాలు
- తూతూమంత్రంగా ఎక్సైజ్ దాడులు
- గత సర్కారులో విక్రయదారులకు దరిచేరని పునరావాస ప్రోత్సాహకాలు
- కొత్త సర్కారు నుంచి ఇంకా రాని స్పష్టత

ఫలించని ప్రభుత్వ వ్యూహం

గుడుంబా నియంత్రణపై గత ప్రభుత్వం దృష్టి పెట్టినప్పటికీ ఫలితాన్ని ఇవ్వలేదని తెలుస్తోంది. గుడుంబా తయారీ, అమ్మకందారులను గుర్తించి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల విలువైన వివిధ రకాల యూనిట్లకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కేసీఆర్ సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 366 మందిని మాత్రమే గుర్తించింది. వీరిలో ఎస్టీలు 133, ఎస్సీలు 100, బీసీలు 129 మంది ఉండగా వీరికి రూ.7 కోట్ల 32 లక్షలను ఖర్చు చేసింది. ఇంకా వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నా వారికి సహకారం అందలేదు. దీంతో గత్యంతరం లేక మళ్లీ తమ పాత వ్యాపారాన్నే చాలా మంది ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వంలో సైతం ఇలాంటి ప్రోత్సాహకాలపై స్పష్టత ఇవ్వకపోవడంతో ఈ దందా సాగించే వారిలో మార్పు రావడం ఇక కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడు నెలల్లో 1,698 కేసులు

జిల్లాలో గడిచిన ఏడు నెలల్లో గుడుంబా కేసులు 1,698 నమోదైనట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. 1104 మందిని అరెస్టు చేశారు. మొత్తంగా 12,780 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, 433,017 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 3,100 కిలోల బెల్లం, 585 కిలోల పటిక, 210 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. బైండోవర్ అయిన 801 మంది, బైండోవర్ అనంతరం పట్టుబడిన 9 మందికి రూ.4లక్షల 5వేల జరిమానా విధించారు.

ప్రజావాణి వినతులపై స్పందించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ



ప్రజావాణిలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 5: ప్రజల నుంచి వచ్చే వినతులపై సత్వరమే స్పందించి జవాబుదారితనంతో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లిలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలను తహసీల్దార్‌కార్యాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులివ్వాలి

పరిశ్రమల ఏర్పాటు కోసం చేసుకున్న దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించిన కలెక్టర్ పరిశ్రమల అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 46 పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేసుకుంటే 42 పరిశ్రమలకు అనుమతులు లభించాయన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 దరఖాస్తులపై సమీక్షించి అనుమతులు ఇవ్వాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు అభిస్తాయన్నారు. టి ప్రైడ్ పథకం ద్వారా ముగ్గురు దరఖాస్తుదారులకు రూ.11లక్షల సబ్సిడీ మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

కన్వేయర్ బెల్ట్‌కు భూసేకరణ పూర్తిచేయాలి

తాడిచెర్ల నుంచి కొంపల్లి వరకు కేటీపీపీకి బొగ్గు రవాణాకు కన్వేయర్ బెల్ట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కన్వేయర్ బెల్ట్ భూసేకరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కన్వేయర్ బెల్ట్ నిర్మాణంకు 37 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 17 ఎకరాల భూసేకరణ పూర్తి అయ్యిందన్నారు. మిగిలిన 18 ఎకరాల భూసేకరణను త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, కేటీపీపీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం శ్రమిస్తేనే ఉన్నత శిఖరాలకు..

డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి

కాటారం, ఆగస్టు 5: కష్టంతో కాకుండా ఇష్టపడి చదువుతూ నిరంతరం క్రమశిక్షణతో శ్రమిస్తేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని డీఎస్పీ గడ్డం రాంమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏవీఎస్ ఫంక్షన్ హాల్‌లో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని ఉన్నత తరగతి విద్యార్థులకు స్వయంకృషి స్వచ్ఛంద సేవా సంస్థ, హైదరాబాద్ ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్, రామ్‌కమల్, శ్రీనివాస్ బాపూజీ, సదానంద్, జాడి శ్రీశైలం మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాల బారిన పడకుండా తమ జీవిత ఆశయాన్ని ఎంచుకుని దానిని సాధించేవరకు ముందుకు సాగాలన్నారు. డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, ఎంఏవో గిరి రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక తమ ఉద్యోగాల సాధనలో శ్రమించిన తీరును విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సతీష్, మనోహర్, సందీప్, సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరానికి శ్రావణశోభ

భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు



ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

మహదేవపూర్, ఆగస్టు 5: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. శివుడికి ప్రీతికరమైన సోమవారం రోజే శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఉదయం నుంచే భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించి గోదావరి మాతకు పూజలు నిర్వహించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలతో పాటు మహా రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు, శుభానందదేవి అమ్మవారు, సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలోని పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గోదావరిలో శ్రావణ స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. శివుడికి బిల్వదళాలతో లక్షపత్రి పూజలతో పాటు పలు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.

వన సంరక్షణతోనే మన సంరక్షణ

- గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం చూసుకోవాలి
- అడవుల పెంపుతోనే మానవుల మనుగడ
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



అబ్బాపూర్ బ్లాక్ ఫారెస్ట్‌లో ఈత మొక్క నాటుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్ ఆగస్టు 5: వన సంరక్షణతోనే మన సంరక్షణ ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిని రాష్ట్ర వ్యాప్తంగా కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ములుగు మండలం అబ్బాపూర్ బ్లాక్ ఫారెస్ట్‌లో సోమవారం మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్‌లతో కలిసి ఈత మొక్కలను నాటారు. గ్రామ పంచాయతీ నుంచి జడ్పీహెచ్ఎస్ పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వన సంరక్షణతోనే మానవ రక్షణ ఉంటుందని, పర్యావరణం కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అడవులను కాపాడుకోవాలని కోరారు. గ్రామాల్లో స్వచ్ఛదనం కార్యక్రమంతో పాటు మొక్కలను పెంచి పచ్చగా ఉంచుకోవాలని, అడవులతోనే మానవుల మనుగడ ముడిపడి ఉందన్నారు. ర్యాలీలో వివిధ పాఠశాలల విద్యార్థులు, కళాకారులు, మహిళా సంఘాలు సభ్యులు పాల్గొనగా, మీరంతా ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కొక్కరు ఆరు మొక్కలు నాటాలని సంరక్షించాలని మంత్రి సూచించారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను ప్రతి రోజు పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే ములుగు జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేలా కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. అనంతరం అబ్బాపూర్ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మంత్రికి వినతి పత్రం అందజేశారు. అనంతరం మంత్రి సీతక్కను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్, జిల్లా నాయకుడు బాదం ప్రవీణ్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి

భూపాలపల్లి టౌన్, ఆగస్టు 5: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని 1వ వార్డులో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వర్షాకాలం కావడంతో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



గడ్డిగానిపల్లిలో స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీ నిర్వహిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి, అధికారులు

వలస ఆదివాసీలకు హక్కు పత్రాలివ్వాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు పుల్లయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు పుల్లయ్య

ఏటూరునాగారం, ఆగస్టు 5: వలస ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు ప్రభుత్వం వెంటనే హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకుడు కారం పుల్లయ్య అన్నారు. సోమవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీల సంఘం జిల్లా కార్యదర్శి గొంది రాజేష్ అధ్యక్షతన వలస ఆదివాసీల జిల్లా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పుల్లయ్య హాజరై మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఏటూరునాగారం ఏజెన్సీ మండలాల్లో నివాసం ఏర్పాటు చేసుకొని ఎన్నో ఏళ్లుగా కష్టనష్టాలను భరిస్తూ జీవనం సాగిస్తున్న వలస ఆదివాసీలకు ఎస్టీ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. 2004లో బతుకు జీవుడా అంటూ అడవిని పోడు చేసి సుమారు 20ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్నా ఇంత వరకు హక్కు పత్రాలు ఇవ్వలేదని, అందుకే అటవీశాఖ అధికారులు నిత్యం ఆదివాసీలపై దాడులు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా వలస ఆదివాసీ మహిళలపై అత్యాచార యత్నం జరిగిన వారికి న్యాయం జరగలేదని, దీనికి కారణం ఎస్టీ సర్టిఫికెట్ లేకపోవడమేనని ఆయన అన్నారు. గత ప్రభుత్వం వలస ఆదివాసీలకు హక్కు పత్రాలు ఇవ్వమని, ఎస్టీలు కాదని ఆదివాసీలను తిరిగి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి పంపించాలని గత ముఖ్యమంత్రి ప్రయత్నించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామని అంతేకాకుండా వలస ఆదివాసీలకు గిరిజన సర్టిఫికెట్లు ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. అదే దిశగా ప్రభుత్వం 8 నెలలు పూర్తి చేసుకున్నా ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదని అన్నారు. అటవీశాఖ అధికారులు ఆదివాసీ గూడెలలో కందకాలు తీసి గిరిజనులపై తప్పుడు కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు. వలస ఆదివాసీలందరూ హక్కుల కోసం ఐక్యమై పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, గ్యానం వాసు, రత్నం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్డీ.దావూద్, దుగ్గి చిరంజీవి, దామోదర్, కుష్ణబాబు, వీరబాబు, రాజు, గంగయ్య, రాము, ఉంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



దర్బార్‌లో పీవో చిత్రామిశ్రాకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 5: గిరిజన దర్బార్‌లో గిరిజనులు తమ దృష్టికి తీసుకొస్తున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలని సెక్టోరియల్ అధికారులను పీవో చిత్రామిశ్రా ఆదేశించారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజనుల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. దర్బార్‌లో మొత్తం 20 మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. వినతులు సమర్పించిన వారిలో ఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఏఎన్ఎంగా ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగపేట మండలం చింతకుంట గ్రామానికి చెందిన మరియమ్మ పీవోను వేడుకున్నారు. ఈనెల 9న జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరిపించేందుకు ఆదివాసీ సంఘాలతో కో-ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించాలని ఆదివాసీ సంఘ నాయకుడు గొప్ప వీరయ్య పీవోకు విన్నవించారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని పూర్తి చేశానని, దానికి సంబంధించిన బిల్లులు 8నెలలుగా చెల్లింపులు జరగక ఇబ్బందులు పడుతున్నానని, వెంటనే బిల్లులను మంజూరు చేయాలని గుంజ సారయ్య పీవోకు తెలియజేశారు. అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నానని, ట్రైబల్ రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని తాడ్వాయి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన బుచ్చయ్య పీవోను వేడుకున్నారు. నిరుద్యోగ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నానని, ఐటీడీఏ దినసరి వేతనం కింద ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏటూరునాగారం మండలం శివాపురం గ్రామానికి చెందిన ముద్దబోయిన జోస్న పీవోను కోరారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సీఆర్‌టీగా ఉద్యోగావకాశం కల్పించాలని ములుగు మండలం మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక రాజ్‌కుమార్ పీవోకు విన్నవించారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఏపీవో సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీపై ఉపాధ్యాయులకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య


తాడ్వాయి, ఆగస్టు 5: మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్ ఆవరణలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సోమవారం ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య మాట్లాడారు. ప్రస్తుతం ప్రజలు అవగాహన లేక పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నారని, దీంతో అనేక రకాల నొప్పులకు సంబంధించి మందులు వాడి అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో విద్యార్థులకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించినట్లయితే వారు తల్లిదండ్రులకు తెలుపుతారని చెప్పారు. అనంతరం స్టేట్ ఫిజియోథెరపీ మెంబర్ డాక్టర్ రమేష్ పలు రకాల నొప్పులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రణధీర్, మండల నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, ప్రధానోపాధ్యాయులు నందకిషోర్, విద్యాసాగర్, రాజేష్, సీఆర్పీ కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెండు రోజులపాటు కోమటిపల్లి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, ఆగస్టు 5 కాజీపేట - హసన్‌పర్తి రైల్వే స్టేషన్ మధ్య ఉన్న కోమటిపల్లి రైల్వే గేటును మంగళవారం, బుధవారం రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ పనుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మార్గం మీదుగా ప్రయాణించే వారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.









నర్సరీలో మొక్కను నాటుతున్న జంగా రాఘవరెడ్డి

ఆయిల్‌పామ్ సాగు పెంపుపై దృష్టి


తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి

జనగామ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును మరింతగా పెంచేందుకు ప్రభుత్వం సారించిందని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. జనగామ మండలం ఎల్లంల శివారులో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతుల కు ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా బలపడే అవకాశం ఉన్నందున రైతులు ఈ సాగుపై మొగ్గుచూపాలన్నారు. సాగుకు నాణ్యమైన మొక్కలను అందించేందుకు గానూ నర్సరీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనంతరం జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెంపునకు సంబంధించి అధికారులతో సమావేశం నిర్వహించారు. వన మహోత్సవంలో భాగంగా నర్సరీలో జంగా మొక్కను నాటారు. ఆయన వెంట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీధర్ రావు, అధికారులు రవికాంత్, రామకృష్ణ, రవళి, ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు.



















ఇంటర్ విద్యార్థి అదృశ్యం

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: మండలంలోని శివునిపల్లి గ్రామానికి ఎస్. యశ్వంత్‌రెడ్డి అనే ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి అదృశ్యమైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రు లు మహేశ్వరి - అమరేందర్‌రెడ్డి తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి. యశ్వంత్‌రెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో డివిజన్ కేంద్రంలోని హోలీక్రాస్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ హనుమకొండలోని ఓ ప్రయివేటు కళాశాలలో బైపీసీ గ్రూపులో చేరి హస్టల్‌లో ఉండి చదువుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం యశ్వంత్‌రెడ్డి తల్లిదండ్రులతో ఫోన్‌లో బాగానే మాట్లాడాడని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున హస్టల్ వార్డెన్ విద్యార్థులను నిద్రలేపే క్రమంలో యశ్వంత్‌రెడ్డి కనిపించలేదు. వార్డెన్ ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇవ్వగా.. ప్రిన్సిపాల్ విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. వెంటనే తల్లిదండ్రులు బంధువలకు, తెలిసినవారికి ఫోన్ చేసి అడిగి పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి వెతికినప్పటికీ యశ్వంత్‌రెడ్డి జాడ దొరకలేదు. దీంతో సోమవారం సాయంత్రం తల్లిదండ్రులు హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థి మిస్సింగ్ పై ఫిర్యాదు చేశారు. తమ కుమారుడి అచూకీ తెలుసుకొని అప్పగించాలని పోలీసులను వేడుకున్నారు. ఎవరికైనా అచూకీ తెలిస్తే 8897224045, 9866509162, 9704618147 నెంబర్లలో సమాచారం అందించాలని వేడుకున్నారు.

గర్భిణీపై దాడి.. గర్భస్థ శిశువు మృతి

పోలీసులను ఆశ్రయించిన మహిళ భర్త

మడికొండ, ఆగస్టు 5: నిండు గర్భిణీ పై కొందరు వ్యక్తులు దాడి చేయడంతో సదరు మహిళ గాయపడి గర్భంలో ఉన్న శిశువు మృతి చెందిందని అందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత మహిళ భర్త పోలీసులను ఆశ్రయించాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. ధర్మసాగర్ మండలం శాయిపేటకు చెందిన చేపూరి శ్రీధర్ కాజీపేట మండలం రాంపేటకు చెందిన అనూషను కొన్నేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. కొంతకాలం కాపురం చేసిన తర్వాత కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం ఆముదాలపల్లికి చెందిన మెడుదల అమిత అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. కాగా, కొంతకాలంగా శ్రీధర్ తిరిగి తన మొదటి భార్య అయిన అనూషతో కలిసి ఉంటూ తన రెండో భార్య వద్దకు వెళ్లడంలేదు. ఈక్రమంలోనే మొదటి భార్య గర్భం దాల్చింది. ఆమె తన తల్లిగారింటి వద్ద ఉండగా నిండు గర్భిణీగా ఉన్న భార్య అనూషను ఆస్పత్రికి తీసుకెళ్ళడానికి శ్రీధర్ రాంపేటకు చేరుకున్నాడు. ఆదివారం తన రెండో భార్య అమిత.. మరికొందరితో కలిసి రాంపేటకు చేరుకొని తన భర్త శ్రీధర్, అతడి మొదటి భార్య అనూషపై దాడి చేశారు. దీంతో గాయపడిన అనూషను ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆపరేషన్ చేసి శిశువును బయటికి తీసి గర్భంలోనే చనిపోయిందని తెలిపారు. దీంతో తన భార్యపై దాడి చేసి గర్భంలో ఉన్న శిశువు మృతికి కారణమైన వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని సోమవారం శ్రీధర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మెడికల్ ప్రవేశాల్లో ఎన్‌సీసీ కోటా టెన్షన్

2023-24నుంచి ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లలో వాటా కట్ ● ఈ మెడికల్ కౌన్సెలింగ్‌కైనా కోటా అమలు చేయాలని విద్యార్థుల విజ్ఞప్తి



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాపై విద్యార్థుల్లో టెన్షన్ నెలకొంది. త్వరలోనే మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలను చేపట్టేందుకు వరంగల్ కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం రద్దు చేసిన ఎన్‌సీసీ కోటాను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరిస్తుం దా? లేదా? అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. రాష్ట్రం లో 5జూలై 2017లో జీవో నెం.114ద్వారా మెడికల్ కోర్సులైన ఎంబీబీఎస్, బీడీఎస్‌ల్లో ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్‌ను అమలు చేశారు. ఇంటర్మీడియేట్ కంటే ముందు ఎన్‌సీసీలో ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో పాటు 75శాతం ఎన్‌సీసీ తరగతులకు హాజరైన వారికి మెరిట్ ఆధారంగా మెడికల్ ప్రవేశాల్లో రిజర్వేషన్ కల్పించారు. కన్వీనర్ కోటాలో ఉన్న సీట్లలో ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీటు లభించేంది. ప్రతి ఏటా మెడికల్ సీట్ల ఆధారంగా 50 నుంచి 60మంది వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ సీట్లు లభించేవి. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 4జూలై 2023న జీవో నెం.75ను జారీ చేసింది. ఎన్‌సీసీ కేడెట్స్‌కు కల్పిస్తున్న 1శాతం రిజర్వేషన్ తొలిగించి, పీడబ్ల్యూడీ కోటాను పెంచుతున్నట్లు పేర్కొంది. వరంగల్‌లోని కాళోజీ హెల్త్ యూనివర్సిటీకి ఈ మేరకు ప్రభుత్వం లేఖ రాసింది. దీంతో గత ఏడాది మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ పని చేయకుండా పోయింది. గత నాలుగైదేళ్లుగా మెడికల్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో ప్రవేశం పొందాలని శిక్షణ పొందిన విద్యార్థులకు నిరాశ మిగిలింది. ఈ ఎన్‌సీసీ కోటాలో ప్రవేశాలు పొందే వారిలో అత్యధికంగా పేదలే ఉన్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఎన్‌సీసీ కోటా ద్వారా మెడికల్ కల నేరవేరుతుందనే ఆశలు గల్లంతయ్యాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వందలాది మంది ఎన్‌సీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజర్వేషన్ పునరుద్ధరించేనా?

దేశభక్తిని పెంచే ఎన్‌సీసీ విద్యార్థులకు మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. గత ప్రభుత్వం తొలిగించిన 1శాతం రిజర్వేషన్‌ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా లేక గత పద్ధతినే పాటిస్తుందా అనే ఉత్కంఠలో విద్యార్థులున్నారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 10వేల ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు ఉన్నాయి. వీటిలో కన్వీనర్ కోటాలో 6వేల సీట్లు కేటాయిస్తారని, ఎన్‌సీసీ విద్యార్థులకు 1శాతం రిజర్వేషన్ కల్పించిన సుమారు 60మంది ఎన్‌సీసీ కేడెట్స్‌కు మెడికల్ కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభిస్తుందనే ఆశతో ఉన్నారు. ప్రొఫెషనల్ కోర్సులైనా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్, వెటర్నరీ తదితర అన్ని కోర్సుల్లో ఎన్‌సీసీ కోటా అమలు చేస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కోర్సులో కూడా ఎన్‌సీసీ కోటాను పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఆపరేషన్ 'కరెంట్ పోల్'

విద్యుత్ శాఖలో కొత్త ఒరవడి ● అధికారుల చొరవతో మారుతున్న పనితీరు ● అర్జీలు పెట్టకముందే ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం ● ముమ్మరంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మరమ్మతులు ● పోల్స్‌కు నెంబరింగ్‌తో సులభంగా సమస్యల గుర్తింపు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పనితీరు మారుతోంది. ఉన్నతాధికారుల చొరవతో కొత్త ఒరవడి కనిపిస్తోంది. ఒకప్పుడు అర్జీలు పెట్టుకుని, కాళ్ల చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారానికి నోచుకోని సమస్యలకు కూడా సమాధానం దొరుకుతోంది. వరిగిపోయి, తుప్పు పట్టి కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, తెగిన, వదులుగా మారిన స్టేవైర్లు, పోల్‌కు పోల్‌కు మధ్య సాగి వేలాడుతున్న లైన్లను సరిచేయడంలో విద్యుత్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతులతో పాటు గృహ వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించి మరమ్మతులు చేస్తున్నారు. అలాగే 33 కేవీ, 11 కేవీ, ఎల్‌టీ స్తంభాలకు నెంబరింగ్ వేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. ఈ నెంబరింగ్‌తో సబ్‌స్టేషన్, ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ పరిధిలో ఉన్న విద్యుత్ లైన్స్‌లో సమస్య ఉత్పన్నమైనప్పుడు సమస్య ఉన్న ప్రాంతాన్ని విద్యుత్‌శాఖ దగ్గర ఉన్న మ్యాప్ ద్వారా గుర్తించేందుకు వీలు కలుగుతుంది. పసుపు రంగుపై ఎరుపు రంగుతో ఏరియా, పోల్ వరుసక్రమాన్ని స్పష్టంగా కనిపించేలా రాయిస్తున్నారు. దీని ద్వారా విద్యుత్ సిబ్బంది ఎలాంటి ఆటంకాలు లేకుండా సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకుంటారు. గతంలో ఈ విధానం ఉన్నప్పటికీ స్పష్టంగా లేకపోవడంతో కొంత మార్పులు చేసి కొత్తగా విద్యుత్ స్తంభాలకు నెంబరింగ్ వేస్తున్నారు. అలాగే వర్షాలు పెరగనున్న నేపథ్యంలో తుప్పుపట్టిన స్తంభాల స్థానంలో కొత్తవి, వంగిన స్తంభాలను నిటారుగా నిలబెట్టే పనులను ఇప్పటికే పూర్తి చేశారు.





మహబూబాబాద్ సర్కిల్‌లో వంగిన తర్వాత, నిటారుగా నిలబెట్టిన తర్వాత విద్యుత్‌స్తంభాల దృశ్యం

సరిచేసినవి, కొత్తవి స్తంభాలు

హనుమకొండ సర్కిల్‌లో..	
నిటారుగా చేసినవి	941
కొత్తవి స్తంభాలు	109
స్టే వైర్లు	158
సరిచేసిన లూజ్‌లైన్‌లు	37 కి.మీ
వరంగల్ సర్కిల్‌లో..	
నిటారుగా చేసినవి	634
కొత్తవి (తుప్పు స్థానం)లో	35
స్టే వైర్లు	245
సరిచేసిన లూజ్ లైన్లు	34 కి.మీ
భూపాలపల్లి, ములుగులో..	
నిటారుగా చేసినవి	507
సరిచేసిన లూజ్ లైన్	5.28 కి.మీ
జనగామలో..	
నిటారుగా చేసిన స్తంభాలు	175

లూజ్‌లైన్లకు మోక్షం

గ్రామాల్లోని చెలకలు, పొలాల వద్ద లూజ్‌లైన్‌ల వద్ద పశువులు, మనుషులు విద్యుత్ వైర్లకు తాకి ఉమ్మడి జిల్లాలో మృత్యువాతపడ్డ ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. దీనిని అరికట్టేందుకు విద్యుత్‌శాఖ అనేక ఏళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ సమస్యకు పరిష్కార మార్గం చూపలేదు. ఎన్పీడీసీఎల్ సీఎండీగా కర్నాటీ వరుణ్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన ఈ 7 నెలల వ్యవధిలో ఎన్పీడీసీఎల్ పరిధిలో లూజ్ లైన్‌లు ఉన్న ప్రతీ చోట మిడిల్ పోల్ ఏర్పాటు చేయడం, సరిపోను స్తంభాలుంటే విద్యుత్ వైర్లను గట్టిగా లాగి సరిచేయడం లాంటివి చేశారు. విద్యుత్ స్తంభాలు వంగకుండా సపోర్ట్‌గా స్టేవైర్లు ఏర్పాటు చేశారు.

నియోజకవర్గంలో అవినీతి అంతమే నా లక్ష్యం

అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదు : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 5: నియోజకవర్గంలో అవినీతిని అంతమొందించడమే తన లక్ష్యమని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ మంజూరు ప్రక్రియలో ఎవరూ అధికారులకు ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, ఏ అధికారైన దరఖాస్తును ముందుకు తీసుకెళ్లడానికి డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన 35మంది లబ్ధిదారులకు రూ 35,04,060 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 140మందికి రూ. 40,50,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకపై కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నెల రోజులలోపే లబ్ధిదారులకు అందించేలా కృషి చేస్తానని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి నిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సల కోసం ఎల్‌ఓసీలు ఇప్పించేలా సహకరిస్తానన్నారు. తాను ఎమ్మెల్యే అయితే పనులు జరుగుతాయని, సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని, అవినీతి ఉండదనే నమ్మకంతో ప్రజలు తనను గెలిపించారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని వంద పడలక ఆస్పత్రి నిర్మాణానికి నిధులు, వైద్య సిబ్బంది, ఆర్టీసీ డిపోకు కేటాయించిన స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి వెంటనే అమలు చేసేలా చూస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ నెలలోనే ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. డివిజన్ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజన్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.24కోట్ల నిధులతో అంచనాలు రూపొందించి సీఎంకు అందజేశామని, దాంతో సీఎం స్పందించి ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచే కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రాంభిద్దామని పేర్కొన్నట్లు గుర్తు చేశారు. డివిజన్ కేంద్రంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణానికి, రెండెకరాల విస్తీర్ణంలో పబ్లిక్ గార్డెన్ అందులో వాకింగ్ ట్రాక్, జిమ్‌ను ఏర్పాటు చేసేలా ప్రభుత్వ స్థలాలను అధికారులు వెంటనే గుర్తించాలని సూచించారు. రోడ్ల విస్తరణ పనులను చేపట్టబోతున్నామని, తాటికొండ క్రాస్ రోడ్డు నుంచి మల్లన్నగండి రిజర్వాయర్ వరకు, పల్లగుట్ట క్రాస్ రోడ్డు వద్ద నుంచి గార్లగడ్డతండా వరకు, విశ్వనాథపురం నుంచి జఫర్‌గడ్ మండలంలోని ఓబులాపూర్ క్రాస్ రోడ్డు వరకు, ఉన్న సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ రవీందర్, ఎంపీడీవో మధుసూధన్, బ్లాక్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, రాపోలు మధుసూధన్ రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్ రెడ్డి, చాడ రాజ్‌కుమార్, చల్లా రాజిరెడ్డి, నాగరబోయిన యాదగిరి, కోతి రాములు, రజాక్‌యాదవ్, గన్ను నర్సింహులు, తెల్లాకుల రామకృష్ణ, తోట వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రిని

ప్రారంభించిన సీతక్క



ఏడ్జర్లపల్లిలో కంటైనర్ ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వాజేడు, ఆగస్టు 5: వాజేడు మండలంలోని ఏడ్జర్లపల్లి కొత్తురులో నూతనంగా మంజూరైన కంటైనర్ ఆస్పత్రిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం ప్రారంభించారు. సోమవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర, డీఎంహెచ్‌వో అప్పయ్యతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. కంటైనర్ ఆస్పత్రిలో బీపీని చెక్ చేయించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాజేడు మండలంను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని, ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. జిల్లాలో రెండో కంటైనర్ ఆస్పత్రిని వాజేడు మండలంలో ప్రారంభించడం ఆనందంగా ఉందని, ఈకంటైనర్ ఆస్పత్రిలో ప్రతి వారంలో రెండు రోజులపాటు వైద్యుడు అందుబాటులో ఉండాలన్నారు. నిత్యం ఏఎన్‌ఎం విధులు నిర్వహించి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలో పలు స్వచ్ఛందసంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు జరుపుతున్నామని, స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని, ఇందులో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. యువతకు ఉద్యోగాల కల్పన కోసం ఐటీఐల ద్వారా స్కిల్ ప్రోగ్రాంను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆ విధంగా పథకాలను రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘంలో ఉన్న మహిళలకు ప్రమాద బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. త్వరలోనే భద్రాచలం నియోజకవర్గంలో ఇళ్లను మంజూరు చేస్తానన్నారు. వాజేడు, వెంకటాపురం మండలాలలో వరదల వల్ల ఇబ్బందులు పడుతున్నారని ఆ సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

గుంతల రోడ్డులో సీతక్క కాన్వాయ్ ప్రయాణం

ఏడ్జర్లపల్లికి వచ్చేందుకు మంత్రి సీతక్క ఇబ్బందులు పడ్డారు. పూసూరు నుంచి ఏడ్జర్లపల్లికి సుమారు ఏడు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా ఉండటంతో ఆమె కాన్వాయ్ వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో రోడ్డు స్థితిపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడిన సీతక్క తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. తన శాఖ ద్వారా మరిన్ని నిధులు ఇచ్చి రోడ్లను బాగు చేస్తానని హామీ ఇచ్చారు. ఏడ్జర్లపల్లి చుట్టు పక్కల గ్రామాల ఇబ్బందుల స్వయంగా చూశానని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు అధికారులతో మాట్లాడతానన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి రెండు మండలాల అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట జడ్పీటీసీలు తల్లడి పుష్పలత, పాయం రమణ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ వర్మ, ప్రసాదబాబు రాజు, కల్యాణ్, తదితరులు ఉన్నారు.

తెలుగులో స్వామికి డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 5: కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధకుడు బానోతు స్వామి డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి స్వామికి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'తెలంగాణ గిరిజన కథా సంపుటాలు' అనే అంశంపై కేయూ ఆర్ట్స్ డీన్, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి పర్యవేక్షణలో బానోతు స్వామి పరిశోధన పూర్తి చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం దేవుని తండాకు చెందిన స్వామి గిరిజన సాహిత్యంలో కథా సాహిత్యంపై ప్రామాణికమైన పరిశోధన గ్రంథాన్ని ప్రచురించారు. జాతీయ గిరిజన ఫెలోషిప్ సాధించా రు. కర్ణాటక మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థకు ఎంపికయ్యారు. 11 అంతర్జాతీయ, మరో 20 జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. గిరిజన సాహిత్యంపై మశప్ అనే పుస్తకాన్ని ముద్రించారు. డాక్టరేట్ సాధించిన స్వామిని పలువురు అభినందించారు.

బీఈడీ కళాశాలలో దివ్యాంగులకు రేపు ప్రత్యేక శిబిరం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: సమగ్ర శిక్ష, అల్మికో ఆధ్వర్యంలో దివ్యాంగులకు బుధవారం హనుమకొండలోని బీఈడీ కళాశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఎం.డీ.అబ్దుల్ హై సోమవారం ఒకప్రటనలో తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు దివ్యాంగ విద్యార్థులను పరీక్షించి వారికి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వారు వారి ఆధార్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికేట్, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న సదరం సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 9 గంటలకల్లా కళాశాలలో ఉండాలని పేర్కొన్నారు.

ఐటీఐలో మూడో దఫా ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలిన సీట్ల కోసం నిర్వహిస్తున్న మూడో దఫా ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.చందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళా విద్యార్థులు సైతం దరఖాస్తులు చేసుకోవచ్చునని, వారికి ప్రవేశాల్లో 33 శాతం రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ కోసం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సోమవారంతో ముగశాయి. గత నెల 18 నుంచి సోమవారం వరకు 13 రోజులుగా జిల్లా కేంద్రంలోని 5 ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు సజావుగా ముగిశాయి. మొత్తం 23,467 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 21,305 మంది పరీక్షకు హాజరు కాగా 2,162 మంది గైర్హాజరయ్యారు. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 90.79 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

9న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల్లోని ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఈనెల 9న హెచ్‌సీఎల్ సహకారంతో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు డీఐఈవోలు కె.మాధవరావు, ఎ.గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ (కో-ఎడ్) కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో 75 శాతంతో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, వొకేషనల్ కంప్యూటర్ సైన్స్ ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ఈజాబ్ మేళాలలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. జాబ్ మేళాలలో ఉద్యోగం సాధించిన వారికి వేతనంతో పాటు ప్రముఖ వర్సిటీల్లో డిగ్రీ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు నరేష్ (7569177071)ను సంప్రదించాలని వారు సూచించారు.

20న ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ కమిటీ ఎన్నికలు

హనుమకొండ టౌన్, ఆగస్టు 5: టీజీ ఎన్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 20న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్, హనుమకొండ సూపరింటెండెంట్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల12 నుంచి 14 వరకు కొత్తగా ఏర్పాటు కాబోయే కౌన్సిల్ నందు సభ్యత్వం కోసం హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ క్రీడాకారుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. 17న దాఖలు చేసిన నామినేషన్లు ఉపసంహరణకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. 20న ఎన్నిక నిర్వహించి సాయంత్రం 5 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత

▸▸ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఎక్కెల గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం, ఆగస్టు 5 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భవిష్యత్‌కు బాటలు వేయాలని, మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఏటూరునాగారం మండలంలోని ఎక్కెల ఆమ్లెట్ గ్రామపంచాయతీ పరిధిలోని హార్టిక ల్చర్ ఉద్యాన వనంలో సోమవారం కలెక్టర్ టీఎస్.దివాకర, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి మంత్రి సీతక్క మొక్కలు నాటారు. పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లోని 31 గ్రామాలకు చెందిన తునికాకు సేకరించిన ప్రజలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.90లక్షల 25వేల విలువ గల చెక్కులను అందజేశారు. అదేవిధంగా పలు గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మొక్కలను విరివిగా నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మొక్కలు మానవాళి మనుగడకు, జీవకోటికి ప్రాణాధారమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.రాజ్యలక్ష్మి, మండల పంచాయతీ అధికారి బూస కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, అటవీశాఖ రేంజ్ అధికారులు అబ్దుల్ రెహమాన్, బాలరాజు, డిప్యూటీ రేంజ్ అధికారులు నరేందర్, ప్రహ్లాద్, రవీందర్, సెక్షన్, బీట్ అధికారులు, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్‌కె.తాజుద్దీన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.అయ్యూబ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఖలీల్‌ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

మంగపేట : రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో సోమవారం సీతక్క పర్యటించారు. ముందుగా కమలాపురం జడ్పీ పాఠశాల ఆవరణంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మొక్క నాటారు. అనంతరం పాఠశాల ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీకి మంచి రోజులు రానున్నాయని, పదేళ్ల నుంచి వందలాది కుటుంబాలు ఫ్యాక్టరీ మూతపడి రోడ్డున పడ్డారని తెలిపారు. ఫ్యాక్టరీని త్వరలో పునుద్ధరిస్తామని చెప్పారు. కలెక్టర్ టీఎస్.దివాకర్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంలో ప్రజలందరు భాగస్వాములు కావాలన్నారు. ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రావన్నారు. అనంతరం 18మందికి రూ.18,02,088 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి సీతక్క అందజేశారు. పాఠశాల విద్యార్థులకు పలువురు దాతలు మెటీరియల్‌ను అందజేయగా దాతలను మంత్రి శాలువాలతో సత్కరించారు. రాజుపేటలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమాల్లో ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ, మండల ప్రత్యేకాధికారి తుల రవి, ఎంపీడీవో శ్రీకాంత్, జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి, మాజీ ఎంపీపీ పచ్చ శేషగిరిరావు, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, కమలాపురం గ్రామ ప్రత్యేకాధికారి సురేష్, పంచాయతీ కార్యదర్శి జె.అరుణ్‌కుమార్, హెచ్‌ఎం జి.శ్రీనివాస్, సీఐ అనుముల శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం రాజుపేటలో కాంగ్రెస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరుగగా సీతక్క హాజరై మాట్లాడారు. త్వరలో జరుగబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని అన్నారు.

తునికాకు లబ్ధిదారులకు బోనస్ చెక్కుల అందజేత

గోవిందరావుపేట, ఆగస్టు 5: తాడ్వాయి, మంగపేట మండలాల్లోని 141 గ్రామాలకు చెందిన తునికాకు సేకరణ లబ్ధిదారులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం రూ.కోటి 55లక్షల 74వేల విలువచేసే చెక్కును అందజేశారు. మండలంలోని పస్రాలో తాడ్వాయి అటవీ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క, కలెక్టర్ టీఎస్.దివాకర, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్‌లతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'స్వచ్ఛదనం-పచ్చదనం

▸▸ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

గణపురం, ఆగస్టు 5: జిల్లా వ్యాప్తంగా సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. గ్రామాల్లో వివిధ శాఖల అధికారులు పాల్గొని ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. గణపురం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మ మొక్కలు నాటి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులతో కలిసి జీపీ కార్యాలయం నుంచి మండల కేంద్రంలోని కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభించిందని తెలిపారు. గ్రామాల్లో ప్రతీ ఇంట్లో ఆరు మొక్కలు నాటాలని, ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నరేష్, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో భాస్కర్ పాల్గొన్నారు.

- కాటారం: మండల వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రారంభమైంది. మండల అధికారులు, జీపీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రజలు, నాయకులతో కలిసి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు పలు జీపీల్లో అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. పలు జడ్పీహెచ్ఎస్‌ల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పారిశుధ్య నిర్వహణ చేపట్టాల్సిన ప్రదేశాలను గుర్తించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పథకాలు విజయవంతమవుతాయని అధికారులు అన్నారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీవో వీరస్వామి, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, హెచ్‌ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో మానవహారం చేపట్టిన అధికారులు, ప్రజలు, నేతలు

- మహదేవపూర్: మహదేవపూర్ మండల కేంద్రంతో పాటు మండలంలో పలు గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి ర్యాలీ చేసి హైస్కూల్‌లో శ్రమదానం చేశారు. గిర్దావర్ జగన్మోహన్‌రెడ్డి, పీహెచ్‌సీ ఆస్పత్రి డాక్టర్ సుష్మిత, హైస్కూల్ హెచ్‌ఎం అన్నపూర్ణ, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సూపర్‌వైజర్ ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి: మండల వ్యాప్తంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామాల స్పెషలాఫీసర్లు ప్రారంభించారు. జీపీల్లో గ్రామస్తులకు అవగాహన కల్పించి ర్యాలీలు నిర్వహించారు. అనంతరం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా మండల స్పెషలాఫీసర్ సునీత మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా చూసుకొని పరిశుభ్రత పాటించాలని అన్నారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ వీవోఏలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, జీపీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.
- మల్హర్: మండలంలో ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మండల వ్యాప్తంగా వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, కళాశాల ప్రిన్సిపాల్ విజయాదేవి, జీపీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాలో..

- కన్నాయిగూడెం: మండలంలోని రాజన్నపేట, చింతగూడెం, ముప్పనపల్లి తదితర గ్రామాల్లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం సోమవారం జరిగింది. గ్రామాల్లో ర్యాలీగా వెళ్లారు. పాఠశాలల్లో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రాజన్నపేటలో జరిగిన కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఎంపీడీవో అనిత, తహసీల్దార్ సలీం, ఎంపీవో సాజీదాబేగం, పంచాయతీ కార్యదర్శులు, ఆశాలు పాల్గొన్నారు.
- తాడ్వాయి: మండల కేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పురస్కరించుకుని అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేబూని మొక్కలు పెంచాలని నినాదాలు చేస్తూ వీధుల వెంట ర్యాలీని కొనసాగించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించగా ఎంపీడీవో సుమనవాణి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండలస్పెషలాఫీసర్ అల్లెం అప్పయ్య, నోడల్ ఆఫీసర్ రేగ కేశవరావు, మండల స్థాయి అధికారులు, ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ విద్యార్థులు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలాపురంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

- వాజేడు: మండలకేంద్రంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. స్థానిక హనుమాన్ సెంటర్‌లో మానవహారం చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ మాట్లాడారు. అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ, సెర్ప్ ఏపీఎం లక్ష్మీదుర్గ, సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపురం(నూగూరు): మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 9వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మొక్కలు నాటాలన్నారు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని, బావుల్లో క్లోరినేషన్ పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో భవాని, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.
- వెంకటాపూర్(రామప్ప): మండల కేంద్రంలోని మైనారిటీ కళాశాల ఆవరణలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఆవరణలో ఉన్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. అంతకుముందు విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ కళాశాల ఆవరణలో విద్యార్థినులచే మొక్కలు నాటించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి దామోదర్, కళాశాల ప్రిన్సిపాల్ వందన, అంగన్‌వాడీ టీచర్లు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.
- మంగపేట: మండలంలోని కమలాపురం, మంగపేట, తిమ్మంపేట, మల్లూరు, రాజుపేట, నర్సింహసాగార్ జడ్పీహెచ్ఎస్‌ల విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకొని స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీలు నిర్వహించారు. మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయా పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో స్థానిక ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీకాంత్, ఐకేపీ ఏపీఎం అప్పారావు, వెలుగు సీసీలు తార, జనార్ధన్, డి.సత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, సురేష్, వి.సురేష్, ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్, పి.మేనక, వెంకటేశ్వర్లు, కస్తూర్బా మహిళా మండలి అధ్యక్షురాలు కొమరగిరి సామ్రాజ్యం, సీపీఎం మండల నాయకుడు నర్ర శివప్రసాద్, వైద్యాధికారి వైశాలి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుమ్మళ్లపల్లి అడవిలో మృతదేహం లభ్యం

▸▸ మతిస్థిమితం సరిగాలేని పోటు సమ్మిరెడ్డిదిగా గుర్తింపు

కాటారం, ఆగస్టు 5 : మండలంలోని గుమ్మళ్లపల్లి అడవుల్లో సోమవారం కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన కేసు నమోదులో పేర్కొన్న అదే గ్రామానికి చెందిన పోటు సమ్మిరెడ్డి మృతదేహంగా గుర్తించినట్లు వెల్లడించారు. ఎస్సై అభినవ్ తెలిపిన ప్రకారం... పోటు సమ్మిరెడ్డికి భార్య తిరుమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్ని నెలల క్రితం తలలో రక్తం గడ్డ కట్టడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేని సమ్మిరెడ్డి ఇంటి వద్దనే ఉంటున్నాడు. గత నెల 23న గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన గేదెలు కనిపించడం లేదని అడవిలో సుమారు 6 కిలోమీటర్ల మేర వెళ్లి వెతుకుతుండా కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించగా పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోమవారం పోలీసులు, గుమ్మళ్లపల్లి గ్రామస్తులు సమ్మిరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి అడవిలోకి వెళ్లి చూడగా సమ్మిరెడ్డి మృతదేహంగా గుర్తించారు. మతిస్థిమితం లేకుండా అడవివైపు వెళ్లి కాలిబాటలో లోపలికి వెళ్లి ఇంటికి తిరిగొచ్చేదారి తెలియక అన్నంలేక, వర్షాలతో చనిపోయినట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి



గట్టయ్య మృతదేహం

కాటారం, ఆగస్టు 5: మండలకేంద్రం శివారులోని ఎర్రగుంటపల్లికి చెందిన మొగిలి గట్టయ్య(75) అనే వృద్ధుడు సోమవారం అట్టె చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన ప్రకారం... గట్టయ్య మధ్యాహ్న భోజనం అనంతరం 3గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. గ్రామస్తులు కొందరు పొలాలకు వెళ్తూ అట్టె చెరువు వైపు వెళ్లగా చెరువు కట్ట సమీపంలోనే మట్టి కోసం జేసీబీతో తీసిన కందకంలోని నీటిలో గట్టయ్య మృతదేహం కనిపించడంతో పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం మహదేవపూర్ సీహెచ్‌సీకి తరలించారు. కాలకృత్యాల కోసం వెళ్లిన గట్టయ్య కాలుజారి చెరువులోని భారీ గుంతలో పడి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ వెల్లడించారు.

నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలకు రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసుకోవాలి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఆగస్టు 5 : జిల్లాలోని నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలన్నింటికి రిజిస్ట్రేషన్ రెన్యూవల్స్ చేయించుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ రవాణా శాఖ అధికారి ఎండీ సంధాని అన్నారు. ఈమేరకు సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 2,079 వాహనాల యజమానులు రిజిస్ట్రేషన్ గడువు ముగిసాక కూడా వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారని పేర్కొన్నారు. ఇది వాహన చట్టానికే వ్యతిరేకమని, అంతేకాకుండా వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రమాదాలకు సైతం అవకాశాలు ఉంటాయన్నారు. రెన్యూవల్ ఫీజు రూపేణా సుమారు రూ.30 లక్షలు ప్రభుత్వ ఖజానాకు రావాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన వాహనాలకు వెంటనే రెన్యూవల్స్ చేయించుకోవాలని, లేదంటే శాఖరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

▸▸ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అజహరుద్దీన్

కాటారం, ఆగస్టు 5: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న పొదుపు పథకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ మంథని సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అజహరుద్దీన్ అన్నారు. కాటారం ఉప తపాలా కార్యాలయం పరిధిలోని దామెరకుంట గ్రామంలో ఆదివారం డీసీడీపీ(డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు తపాలా శాఖ అందిస్తున్న పొదుపు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఇన్‌స్పెక్టర్ అజహరుద్దీన్ మాట్లాడుతూ బాలికలు, వృద్ధులు, మహిళలు, ఉద్యోగులకు అందిస్తున్న ఎస్ఎస్‌వై, ఎస్‌సీఎస్ఎస్, పీపీఎఫ్, పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పథకాల గురించి వివరించారు. ఆయా పథకాల ద్వారా పొదుపు చేసుకోవాలని వారికి సూచించారు.

ఈ కార్యక్రమంలో జీపీ కార్యదర్శి గంగాధరన్, మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్, బీపీఎంలు భార్గవి, కిష్టయ్య, మెయిల్ ఓవర్సీస్ రాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కామారంలో పరిశోధన పద్ధతులపై శిక్షణ

తాడ్వాయి, ఆగస్టు 5: మండలంలోని కామారం గ్రామంలో సమ్మక్క-సారక్క ఆర్కియాలజీ, ఇండియన్ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణలో పాల్గొన్న సెంటర్ డైరెక్టర్ కాక నర్సింగరావు, బిర్సాముండా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రేగ రాజశేఖర్‌లు మాట్లాడారు. పరిశోధన తరగతులు ఆదివాసీ పూర్వ మూలాలు, రాతి చరిత్ర, సింధు నాగరికత, లిపి, గోండ్వాన చరిత్ర, కట్టడాలు, వేల్పు జాతరల చరిత్ర, ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలతోపాటు 14 సబ్జెక్టులపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని అన్నారు. మొదటి రోజు సెంటర్ అసోసియేట్ డైరెక్టర్ కొర్నిబెల్లి గణేష్ ప్రపంచం, భారతదేశ వ్యాప్త భౌగోళిక విస్తీర్ణం, పీఠ భూములు, నదులు, అనుసంధాన వ్యవస్థ, జియోగ్రాఫికల్, గోండ్వాన భూభాగంతో గల సంబంధం, తదితర అంశాలపై పరిశోధక విద్యార్థులకు అవగాహన కల్పించారు. జాయింట్ డైరెక్టర్ బుగ్గ కోటేశ్వర్‌రావు మూడు నుంచి ఏడుగొట్ల కోయతెగ వ్యవస్థ పుట్టుక, గొట్ల ఏర్పాటు పూర్వ చరిత్రపై అవగాహన కల్పించారు. ఆదివాసీల పూర్వ చరిత్రను బయటకు తీసి దేశంలో నిజమైన మూలవాసులం మేమే అని, తొలి శాస్త్రవేత్తలం, నాగరికత నిర్మాతలం అని శాస్త్రీయబద్ధంగా నిరూపణ చేసి చరిత్ర నిర్మించడం పరిశోధన లక్ష్యమని అన్నారు. శిక్షణ కార్యక్రమంలో మేడారం ట్రైబల్ మ్యూజియం క్యూరేటర్ కుర్సం రవి, సెంటర్ సభ్యులు ఇర్ప ప్రభాకర్, కేంద్రీయ విద్యాలయం పురావస్తు శాస్త్రం, భాషా శాస్త్రం విద్యార్థులు పాల్గొన్నారు.



పరిశోధన విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మంగపేట, ఆగస్టు 5 : వరంగల్ జిల్లా కేంద్రంలో ఆదివారం డబ్ల్యూఎఫ్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. మండలంలోని తిమ్మంపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కూనవరపు శివ కాటా విభాగంలో ప్రథమ స్థానం సాధించాడని ప్రధానోపాధ్యాయుడు పి.సత్యనారాయణ తెలిపారు. 7వ తరగతి చదువుతున్న సుంచ ప్రవీణ్ కాటా విభాగంలో తృతీయ స్థానం, కుమేటి విభాగంలో ప్రథమ స్థానంలో గెలిచాడని చెప్పారు. విజేతలను పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు, సత్యనారాయణ, కరాటే మాస్టర్, పీఈటీ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ వర్తింపజేయాలి

తాడ్వాయి, ఆగస్టు 5: ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి రైతుకు రూ.2లక్షల రైతు రుణమాఫీ వర్తింజేయాలని కిసాన్ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లెల రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రుణమాఫీ చేస్తామని పేర్కొని ఆంక్షల పేరుతో రుణమాఫీ చేయడం లేదన్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని గ్రామాలకు బీటీ, మెటల్‌రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బర్లపురం నరేష్, మాదరి శ్రీకాంత్, ద్యాగల సలేందర్, తాళ్లపల్లి లక్ష్మణ్, మోరె నాగేశ్వర్, ఆలం శ్రీను, సుభాష్, వెంకటేశ్వర్లు, సురేందర్ పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



అన్వితను సన్మానిస్తున్న అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

టేకుమట్ల, ఆగస్టు 5: ఇంజనీరింగ్ ఈసీ విభాగంలో స్టేట్ 20వ ర్యాంకు సాధించిన రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన చుక్క అన్వితకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానం చేశారు. మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామానికి చెందిన చుక్క అన్విత ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంకు సాధించినందుకు గాను అభినందిస్తూ ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అనిత, ఎస్సై ప్రసాద్ హాజరై విద్యార్థిని అన్వితకు శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి పోటీ పరీక్షలలో రాష స్థాయిలో 20వ ర్యాంకు సాధించడం గొప్ప విషయమని విద్యార్థిని కొనియాడారు. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఎమ్మార్పీఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు దూడపాక శ్రీను, మాజీ సర్పంచ్ చదువు మధుర, మహేందర్, వంగ ప్రభాకర్, గొల్లపెల్లి వెంకన్న, కొండ్ర పవన్, బొంకూరి రాములు, సందీప్, వెంకటేష్ పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి అవార్డు

మహదేవపూర్, ఆగస్టు 5: మహదేవపూర్ మండల కేంద్రంలోని టస్సర్ కాలనీకి చెందిన నేత కార్మికుడు గోరంట్ల శ్రీనివాస్ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి చేనేత అవార్డుకు ఎంపికయ్యారు. నేత కార్మికుడు ప్రకృతి సిద్ధ రంగులతో చేసిన బుటా చీర రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. ఈనెల 7న హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే జాతీయ హ్యాండ్లూమ్ కార్యక్రమంలో అవార్డుతో పాటు రూ.25వేలు నగదు అందుకోనున్నట్లు తెలిపారు.

పారిశుధ్య పనుల తనిఖీ

తాడ్వాయి, ఆగస్టు 5: మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను అదనపు కలెక్టర్ పి.శ్రీజ సోమవారం తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్, ఎస్సీ కాలనీ, అంగన్‌వాడీ కేంద్రాలు, తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వీధుల వెంట చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని, మురికిగుంతలను పూడ్చివేయాలన్నారు. అదేవిధంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాణి, ఈజీఎస్ ఏపీవో అనిల్, జీపీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

చిట్యాల, ఆగస్టు 5:మండలంలోని నవాబుపేటకు చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు ఈసంపెల్లి భాస్కర్‌కు భూపాలపల్లి జిల్లా కోర్టు జడ్జి నారాయణబాబు 10ఏళ్ల జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన బాలికపై భాస్కర్ లైంగిక దాడికి పాల్పడినట్లు 2019లో తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన అధికారులు సరైన సాక్ష్యాలను గుర్తించారు. కాగా, కోర్టు లైజన్ ఆఫీసర్ వెంకన్న, పోక్సో కేసు సీడీపీవో శ్వేత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్‌రావు సాక్ష్యులను హాజరుపర్చగా జడ్జి పై తీర్పును ఇచ్చారు. సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఏటూరునాగారం, ఆగస్టు 5 : కరీంనగర్ జిల్లాలో ఈనెల 4న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ కప్, ఫస్ట్ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024 కరాటే గేమ్స్‌లో మండల కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్‌లు ఎమ్డీ.అబ్బు, హుస్సేన్ సోమవారం ఒక ప్రకటలో తెలిపారు. సబ్ జూనియర్ బాయ్స్ విభాగంలో జరిగిన పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన వసంత విశాల్‌సాయి ఉత్తమ ప్రతిభ కనబర్చి బంగారం పతకం సాధించారు. రజత పతకానికి అఖిలేష్ కుమార్, నవ్య, రాజిత, విజ్ఞాశ్రీ, మణిదీపిక, దినేష్ ఎంపికైనట్లు చెప్పారు. కాంస్య పతకాలను శ్రీరామ్, సహస్ర, లక్ష్మి సాధించగా ఇందులో విశాల్‌సాయి, నవ్య, అన్వేష్‌లు గ్రాండ్ ఛాంపియన్‌షిప్ సాధించి నగదు పురస్కారం పొందారని కోచ్ అబ్బు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ములుగు కలెక్టరేట్, ఆగస్టు 5: సైబర్ క్రైం నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్సై రామకృష్ణ సూచించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఎస్సీవాడలో ఆయన ప్రజలను సమావేశపరిచి అవగాహన కల్పించారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. వారు పంపిన లింకు కాని, వెబ్‌సైట్‌లో పాప్ అప్స్ క్లిక్ చేయకూడదని, సెల్‌ఫోన్‌లో ప్రైవేట్ యాప్స్ డౌన్‌లోడ్ చేయకూడదని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు డయల్ చేయాలని, చిన్నపిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు చూడాలని అన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కోటంచ హుండీ ఆదాయం రూ.16.27లక్షలు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

రేగొండ, ఆగస్టు 5: మండలంలోని కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.16,27,298 వచ్చినట్లు ఆలయ ఈవో మహేష్ తెలిపారు. ఆలయంలో సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ సమక్షంలో ఆలయ హుండీ లెక్కింపు జరిపారు. ఈ సందర్భంగా రూ.15,35,880 నోట్లు, రూ.91,418 నాణేలు, వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, గ్రామ పెద్దలు కొల్లూరి సంపత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఎమ్మెల్యే

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 5: మండలంలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు గార్లపాటి రవి, చిడెం శివ తదితరులు ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీపై డ్రోన్ షూట్ చేసిన వ్యక్తిపై కేసు

▸▸ అనుమతి లేకుండా చిత్రీకరించడంతో అధికారి ఫిర్యాదు

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 5: మండలంలోని మేడిగడ్డ బ్యారేజీతో పాటు గోదావరి నది ప్రవాహాన్ని అనుమతి లేకుండా డ్రోన్ ద్వారా వీడియో చిత్రీకరించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. గత నెల 26న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు రాగా.. వారి వాహన శ్రేణితో పాటు పర్యటనను డ్రోన్ ద్వారా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా అది వైరల్ అయ్యింది. దీంతో తమ అనుమతి లేకుండా డ్రోన్‌తో వీడియో, ఫొటోలు చిత్రీకరించడమే కాకుండా సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ ఏఈఈ వలీ గత నెల 30న మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. డ్రోన్ ద్వారా వీడియో, ఫొటోలు చిత్రీకరించింది ఎవరనేది తెలియదని, విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.